క్లుప్తంగా

సరస్వతీ దేవిగా దుర్గమ్మ



పట్టణంలోని దేవీచౌక్‌లో ఉన్న దుర్గాదేవి ఆలయంలో శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా అమ్మవారిని పసుపుకొమ్ములతో సరస్వతీదేవిగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

– శృంగవరపుకోట

216 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న సెంచూరియన్ సిబ్బంది, బీఎస్సీ విద్యార్థులు

గజపతినగరం: స్థానిక సాయిసిద్ధార్థ జూనియర్ కళాశాలలో శుక్రవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో చదువుతున్న సుమారు 216 మంది విద్యార్థులకు సెంచూరియన్ విశ్వవిద్యాలయం బీఎస్సీ ఆప్తమాలజీ విభాగం విద్యార్థులు కంటి పరీక్షలు చేశారు. 22 మంది నేత్ర సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో సెంచూరియన్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.కె.మహంతి, సాయిసిద్ధార్థ కళాశాల కరస్పాండెంట్ ఎస్.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, వర్సిటీ సిబ్బంది శ్రావణి, ఆలన, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన యువతకు సత్కారం



ఉద్యోగాలు సాధించిన వారిని సత్కరిస్తున్న హేమంత్, రమణ

చీపురుపల్లి: పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ కళాశాల మైదానంలో ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి కంది హేమంత్ వద్ద శిక్షణ పొందుతూ స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ)లో ఉద్యోగాలు సాధించిన 12 మంది అభ్యర్థులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ, ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి హేమంత్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను సత్కరించారు. రన్ మిషన్ పేరుతో ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి హేమంత్ నిరుద్యోగ యువతకు ఆర్మీ, పోలీస్, ఎస్ఎస్‌సీ ఉద్యోగాలకు ఫిజికల్ ఫిట్‌నెస్‌పై శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటివరకు శిక్షణ తీసుకున్న వారిలో 120 మంది వరకు వివిధ విభాగాల్లో ఉద్యోగాలు సాధించినట్లు హేమంత్ తెలిపారు.

3,185 ఎకరాలు ఈ-క్రాప్‌లో నమోదు



ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ కె.మహరాజన్, ఏఓ ధనలక్ష్మి

గజపతినగరం: అతివృష్టి, అనావృష్టి సంభవించినప్పుడు రైతులకు ప్రభుత్వం నుంచి పంట నష్టపరిహారం రావాలంటే రైతులు తాము సాగుచేస్తున్న పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకుని ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ కె.మహరాజన్ తెలిపారు. మండలంలోని శ్రీరంగరాజపురం గ్రామంలో చేపడుతున్న ఈ-క్రాప్ నమోదును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండలలో ఇంతవరకు 3,185 ఎకరాల్లో సాగుచేస్తున్న పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసినట్లు చెప్పారు. ఈనెల 15లోగా మిగిలిన రైతులంతా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి ధనలక్ష్మి, వీఏఏ వినయ్ పాల్గొన్నారు.

92 మందికి ఆరోగ్య సేవలు

గజపతినగరం: మండలం ముచ్చర్ల గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 92 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసినట్లు మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కారిణి సుష్మ తెలిపారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ హర్షప్రియ, ఆరోగ్య కార్యకర్త స్రవంతి, ఆశావర్కర్ రమాదేవి తదితరులు సేవలందించారు.

కౌలురైతుకు భరోసా..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కౌలురైతులకు ఆర్థిక భరోసానిస్తోంది. దేశంలో ఎక్కడా లేనివిధంగా వారికి సాగుకు పెట్టుబడి సాయం అందిస్తోంది. తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద కౌలురైతుల ఖాతాల్లో నిధులు జమ చేసే కార్యక్రమంను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. సొంతభూమి సాగు చేసుకుంటున్న రైతులతో పాటు అటవీ, దేవాదాయ శాఖ భూములు సాగు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కౌలురైతులు కూడా లబ్ధి పొందనున్నారు. కౌలు రైతులకు కూడా పెట్టుబడి సాయం, ఇతర ప్రోత్సాహకాలు అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని రైతుపక్షపాతి, సంక్షేమ సారథిగా ప్రజలు కీర్తిస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



సకాలంలో సమకూర్చారు..



కౌలు రైతులకు ప్రభుత్వం అందిస్తున్న భరోసా సొమ్ము సకాలంలో అందించటం వల్ల పెట్టుబడులకు ఉపయోగపడుతోంది. గత రెండు దఫాలుగా నాకు కౌలురైతుల భరోసా అందింది. ఆ డబ్బులు సాగుఖర్చులకు ఎంతో ఉపయోగపడ్డాయి. ఈ ఏడాది వేసిన కౌలు భరోసా సొమ్ము ఎరువుల కొనుగోలుకు ఉపయోగపడుతుంది.

– నాగిరెడ్డి శ్రీను, కౌలురైతు, వేపాడ

అప్పు చేయాల్సిన పనిలేదు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత పంట పెట్టుబడికి అప్పులు చేయాల్సిన అవసరం రాలేదు. నాలుగేళ్లగా వైఎస్సార్ రైతుభరోసా కింద రూ.13500లు ప్రభుత్వం అందిస్తోంది. విత్తనాలు, ఎరువులు రాయితీపై అందిస్తుండడంతో సాగు ఖర్చులు తగ్గాయి. పండిన పంటను కళ్లాల వద్దకు వచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుండడంతో వ్యవసాయం లాభసాటిగా మారింది. అప్పులన్నీ తీరిపోయి సంతోషంగా ఉన్నాం.

– మచ్చిట్టి ఆదినారాయణ, రైతు, మరడాం గ్రామం, దత్తిరాజేరు మండలం

సాగు పెట్టుబడికి ఊతం



మెట్టప్రాంతంలో వ్యవసాయం చేసుకుంటున్న మాకు ప్రభుత్వం ఇచ్చిన సాగు పెట్టుబడి సాయం ఎంతగానో ఉపయోగపడుతోంది. అప్పుల బాధలు తప్పాయి. గత రెండేళ్లగా ప్రభుత్వం సకాంలో డబ్బులను మా ఖాతాలో వేయడం వల్ల విత్తనాలు, ఎరువుల కొనుగోలు, కూలి ఖర్చులు చెల్లించేందుకు ఉపయోగపడ్డాయి. ఈ ఏడాది కూడా పెట్టుబడి సాయం అందింది.

– పి.సూరీడమ్మ, బొర్రవలస గ్రామం, వేపాడ మండలం

చకచకా పింఛన్ల పంపిణీ



గుర్ల: పాలవలసలో లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతీ నెల ఒకటో తేదీనే పింఛన్ డబ్బులు అందుతుండడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ వలంటీర్లు శుక్రవారం ఉదయం లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. గతంలో పింఛన్ల కోసం పంచాయతీ కార్యాలయం వద్ద గంటలతరబడి నిరీక్షించాల్సి వచ్చేదని, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పింఛన్ డబ్బుల కోసం ప్రయాస పడాల్సిన అవసరం లేదని లబ్ధిదారులు గుర్తుచేసుకుంటున్నారు. పార్టీలకు అతీతంగా.. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తోంది.

– సాక్షి నెట్‌వర్క్



జామి: విశాఖపట్నంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సత్యవమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ చుక్క అప్పలనాయుడు



బొండపల్లి: దేవుపల్లిలో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్న వలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు



గజపతినగరం: విజయనగరంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వాసిరెడ్డి సత్యంకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ లక్ష్మణరావు

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

కొత్తవలస: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం తీరును ఎండగడుతూ గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని బలిఘట్టాం, కొత్తవలస గ్రామాల్లో సీపీఎం నాయకులు గాడి అప్పారావు ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఏడాదికి కనీసం 50వేల ఉద్యోగాలైనా కల్పించలేదని ఆరోపించారు. అలాగే గ్యాస్, పెట్రోల్, నిత్యావసర సరుకుల ధరలు పెంచడమే కాకుండా కార్పొరేట్ సంస్థలకు ప్రజాధనాన్ని కట్టబెడుతున్నారని మండిపడ్డారు. నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో గద్దె దించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గజపతినగరం: కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని సీపీఎం నాయకుడు జి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పురిటిపెంటలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ తీరుతో పేద, మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారం పెరిగిపోయిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన విధానాలను మార్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదన్నారు. అనంతరం పంచాయతీ ఈఓ జనార్దనరావుకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు వి.లక్ష్మి, తదితరులున్నారు.

ఆరోగ్యాన్ని మించిన సంపద లేదు



మంత్రి అప్పలనాయుడు షష్టిపూర్తి కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే అప్పలనరసయ్య

దత్తిరాజేరు: ఆరోగ్యాన్ని మించిన సందప మరొకటి లేదని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని టి.భూర్జవలసలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు, కోమటిపల్లి ఎంపీటీసీ మంత్రి అప్పలనాయుడు, టి.భూర్జవలస ఎంపీటీసీ మంత్రి ఉషారాణి దంపతుల షష్టిపూర్తి మహోత్సవం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ, ఎమ్మెల్యే హాజరై దంపతులను ఆశీర్వదించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 60 ఏళ్ల మనిషి ఆరోగ్యంగా ఉంటే దానికి మించిన సంపద మరొకటి లేదన్నారు. అప్పలనాయుడు, ఉషారాణి దంపతులు నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముత్యాలనాయుడు, ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు ప్రభాజీ, నారాయణమూర్తిరాజు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 20 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ బి.విజయ, తదితరులు

లక్కవరపుకోట: మండలంలోని కొట్యాడ సమీపంలో ఉన్న బెహరా ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 20 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బెహరా విజయ తెలిపారు. విశాఖపట్నంకు చెందిన సినైరిజస్ కాస్టింగ్ కంపెనీ మేనేజర్ ఎస్.వి.డి ప్రసాద్, హెచ్‌ఆర్ డి.జానికిరామ్ అభ్యర్థులకు ఇంటర్వ్యూ చేశారు. ఈ ఇంటర్వ్యూలకు బెహరా పాలిటెక్నికల్ కళాశాల మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాలకు చెందిన 70 మంది విద్యార్థులు హాజరుకాగా.. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 20 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం వారికి నియామక పత్రాలను అందజేశారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఎ.ప్రసాద్, వివిధ డిపార్ట్‌మెంట్‌లకు చెందిన హెచ్‌ఓడీలు బి.చిరంజీవి, కె.వెంకటేష్ అభినందించారు.

ప్రజావేదికతో పనుల్లో పారదర్శకత



మాట్లాడుతున్న సర్పంచ్ సుధారాణి

చీపురుపల్లి: దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి తీసుకొచ్చిన సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదిక ద్వారా ప్రతీ పనిలోనూ పారదర్శకత ఉంటోందని చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి అన్నారు. మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా 2022–23 సంవత్సరంలో చేపట్టిన పనులకు సంబంధించి శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకం ద్వారా వేలాది మంది వేతనదారులకు పని కల్పించడంతో పాటు పంచాయతీ పరిధిలో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. ఇంకా ఎవరైనా అర్హత కలిగిన వేతనదారులు ఉంటే వారికి కూడా జాబ్‌కార్డులు మంజూరు చేస్తామన్నారు. ఈ ఏడాది కాలంలో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందం నివేదికను బహిర్గతం చేశారు. కార్యక్రమంలో బెల్లాన వంశీకృష్ణ, ఇప్పిలి తిరుమల, పతివాడ రాజారావు, ముల్లు పైడిరాజు, గిరడ రాందాసు, కరణం ఆది తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే సీఎం జగన్ లక్ష్యం



ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

● ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: రాష్ట్రంలో పేదవర్గాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ఎస్.కోట పట్టణంలో సచివాలయం–4 పరిధిలో పార్టీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్ నేతృత్వంలో శుక్రవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రతీ గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల కుటుంబాల్లో సంతోషాలు నింపుతున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో పాలనను ప్రజలకు చేరువ చేశారన్నారు. పార్టీలకు అతీతంగా.. అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మీరంతా మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, స్టేట్ ఫోక్‌అకాడమీ డైరెక్టర్ వాకాడ రాంబాబు, పీఆర్ జోనల్ ఇన్‌చార్జ్ మెరపుల సత్యనారాయణ, జేసీఎస్ ఇన్‌చార్జ్ వాకాడ సతీష్, పుణ్యగిరి ట్రస్టీబోర్డు చైర్మన్ పి.రామకృష్ణ, బి.వెంకటరమణ, ఏఎంసీ డైరెక్టర్ డి.పార్వతి, కడారి అప్పయ్య, జయశంకర్, మోపాడ కోటి, మోపాడ ఈశ్వరనాయుడు, పి.గణేష్, అప్పలసత్యం, ఒబ్బిన బంగారునాయుడు, మమ్ముడూరి సోంబాబు, రంధి అనంత్, గుమ్మడి సన్యాసప్పుడు, జయబాబు, బెలగాం సంతోష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

గజపతినగరం: మండలంలోని గుడివాడ గ్రామం జాతీయ రహదారి వద్ద బైక్‌ను వ్యాన్ ఢీకొట్టడంతో ఓవ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. శుక్రవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఇనపసప్పల ప్రసాద్ (24) ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న సమయంలో వెనుకనుంచి వస్తున్న వ్యాన్ బలంగా ఢీకొట్టడంతో కిందపడి తీవ్రగాయాలపాలయ్యాడు. తక్షణమే 108 వాహనం సహాయంతో గజపతినగరం ప్రాంతీయ ఆస్పత్రికి బాధితుడిని తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి విజయనగరం ఆస్పత్రికి తీసుకువెళ్లారు.

అభివృద్ధి పనుల పరిశీలన



చెత్తశుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ పట్నాయక్, సర్పంచ్ వేమననాయుడు

వేపాడ: మండలంలోని ఆతవ గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.కూర్మనాథ్ పట్నాయక్ శుక్రవారం పరిశీలించారు. జీజీఎంపీ నిధులతో నిర్మించిన రెండు బోరు బావులను, పంచాయతీ నిధులతో నిర్మించిన ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలించారు. చెత్తనుంచి సంపద తయారీపై గ్రీన్ అంబాసిడర్లకు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వేమన నాయుడు, పంచాయతీ కార్యదర్శి నానిబాబు, నాగిరెడ్డి నాయుడు, కె.దేముడు, ఆతవ నాగరాజు పాల్గొన్నారు.

కోడి పందాల శిబిరంపై దాడి

కొత్తవలస: మండలంలోని చిన్నరావుపల్లి గ్రామం సమీపంలో రహస్యంగా నిర్వహిస్తున్న కోడి పందాల శిబిరంపై పోలీసులు శుక్రవారం దాడిచేశారు. 13 మంది పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.60,170 నగదు, నాలుగు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వీరజనార్దన్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి

దత్తిరాజేరు: మండలంలోని ఆర్.రామచంద్రాపురంలో శనివారం ఉదయం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కడుబండి రమేష్‌నాయుడు తెలిపారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు చెప్పారు. అన్ని గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు హాజరుకావాలని కోరారు.

గజపతినగరం: నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు శనివారం ఉదయం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పిస్తారని పేర్కొన్నారు. జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

న్యాయవాదుల నిరసన



కొత్తవలస: నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు



గజపతినగరం: ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

కొత్తవలస: న్యాయవాదులపై ఇటీవల జరుగుతున్న దాడులకు నిరసనగా కొత్తవలప జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, జుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్ కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాదులు శుక్రవారం విధులను బహిష్కరించారు. ఇటీవల ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో న్యాయవాదులపై పోలీసులు లాఠీ చార్జ్ చేయడాన్ని కొత్తవలస బార్ అసోసియేసన్ తీవ్రంగా ఖండించింది. దేశంలో న్యాయవాదులకు రక్షణ కరువైయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎంవీ గిరిబాబు, డి.శ్రీనివాసరావు, సీహెచ్‌ఆర్ రామచంద్రరావు, నందిపల్లి శ్రీరామ్మూర్తి, గవర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: విజయవాడలో బార్‌అసోసియేషన్ మెంబర్‌గా ఉన్న టి.కిరణ్‌బాబు అనే న్యాయవాదిపై పోలీసులు అన్యాయంగా ఎస్సీ, ఎస్టీ యాక్టు క్రింద కేసును నమోదు చేయడంపై స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం విధులను బహిష్కరించి కోర్టు ఆవరణంలో ఆందోళన చేపట్టారు. పోలీసులు ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సామాజిక పింఛన్లపై విచారణ



కొత్తవలస: వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శుల నుంచి దరఖాస్తుదారుల వివరాలు సేకరిస్తున్న ఎంపీడీఓ పద్మజ



గుర్ల: పింఛన్‌దారుల నుంచి ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటున్న ఈఓపీఆర్డీ గాయత్రి



వేపాడ: సోంపురంలో కొత్త పింఛన్ల వెరిఫికేషన్ చేస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

కొత్తవలస: మండలంలో 25 గ్రామ పంచాయతీల పరిధిలో నూతనంగా మాజూరైన పింఛన్లపై విచారణ చేసినట్లు ఎంపీడీఓ వై.పద్మజ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ వెల్ఫేర్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని వితంతు, దివ్యాంగ, వృద్ధాప్య పింఛన్ల కోసం కొత్తగా 357 దరఖాస్తులు అందినట్లు చెప్పారు. మొదటి విడతగా 176 మంది దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన పూర్తవడంతో వారికి ఈ నెల పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. మిగిలిన 221 దరఖాస్తులను వెరిఫై చేశామని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేశామని అన్నారు. వారికి నాలుగు రోజుల్లో పింఛన్ డబ్బులు విడుదలయ్యే అవకాశం ఉందన్నారు.

పింఛన్ పత్రాల పరిశీలన

గుర్ల: మండలంలోని నూతనంగా మంజూరైనా 454 పింఛన్లకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను అధికారులు ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం పరిశీలించారు. కొత్తగా మంజూరైనా పింఛన్‌దారుల ఆధార్ కార్డు వివరాలు, మూడు నెలలకు సంబంధించిన విద్యుత్ వినియోగం బిల్లులు, రేషన్ కార్డు, సదరం పత్రాలను ఎంపీడీఓ కల్యాణి, ఈఓపీఆర్డీ గాయత్రి పరిశీలించారు. ఆయా పత్రాలను ఆన్‌లైన్ చేయడం జరుగుతుందని ఈఓపీఆర్డీ తెలిపారు.

275 కొత్త పింఛన్లు మంజూరు

వేపాడ: మండలంలో కొత్తగా 275 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.కూర్మనాథ్ పట్నాయక్ తెలిపారు. ఆతవ, శింగరాయి, బల్లంకి, బానాది గ్రామాల్లో కొత్తగా మంజూరైన పింఛన్లను శుక్రవారం పరిశీలించారు. ఈ రోజు 110 మందికి పింఛన్లు పంపిణీ చేశామని, మిగిలిన వారికి ఐదో తేదీ తర్వాత అందించనున్నట్లు చెప్పారు. జాకేరు, సోంపురం, పాటూరు, కొండగంగుబూడి తదితర గ్రామాల్లో ఎంఈఓ బాలభాస్కరరావు కొత్త పింఛన్ల వెరిఫికేషన్ నిర్వహించారు.

రూ.10 లక్షలతో జాగింగ్ ట్రాక్

చీపురుపల్లి: యువత, క్రీడాకారుల కోరిక మేరకు జాగింగ్ ట్రాక్ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కుమారుడు బెల్లాన వంశీకృష్ణ చెప్పారు. ఈ మేరకు పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని క్రీడాకారులు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వినోద్‌బాబుతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. పోలీసు, ఆర్మీ తదితర ఉద్యోగాలకు ప్రిపేరవుతున్న నిరుద్యోగ యువత ఈ మైదానంలో శిక్షణ తీసుకునేందుకు, అలాగే స్థానికంగా ఉంటున్నవారు మార్నింగ్ వాక్ చేసేందుకు వీలుగా ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.10 లక్షలతో జాగింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

సచివాలయాల్లో వినతులు అందజేత

శృంగవరపుకోట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో పేద, మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారం పడుతోందని, నిరుద్యోగిత పెరిగిపోతోందని సీపీఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. సమరభేరి కార్యక్రమంలో భాగంగా ఎస్.కోట సచివాలయం–4, వెంకటర మణపేట, కొత్తూరు గ్రామాల్లో సచివాలయాల సిబ్బందికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. విద్యుత్ చార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, ఉద్యోగాలు భర్తీచేయాలని, రైతులకు కనీస మద్దతుధర అమలు చేయాలని, తదితర డిమాండ్లను అందులో ప్రస్తావించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మద్దిల రమణ, నాయకులు గమ్మెల సన్యాసిరావు, సాంబ, సీదరి బుజ్జి, చెలికాని ముత్యాలు, భాస్కరరావు పాల్గొన్నారు.